ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ

చందానగర్ : సెయింట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మాదాపూర్ డివిజన్ పరిధి ఆదిత్యనగర్‌లో సెయింట్ ఇసాక్ అడ్వెంట్ హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. శిబిరాన్ని పీఏసీ, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య శిబిరాల నిర్వహణతో పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. సెయింట్ వెల్ఫేర్ సొసైటీ ఫౌండర్ ఇసాక్ లజర్స్, ప్రిన్సిపాల్ కమర్ జాన్ ఇసాక్, అక్తర్, మహమ్మద్ బేగ్, ఆదిత్యనగర్ కాలనీ అధ్యక్షుడు మహమ్మద్ ఖాసీం, సర్ఫరాజ్, మెహినుదుద్దీన్,అమీర్, ఫజల్, షేక్ అస్లాం తదితరులు పాల్గొన్నారు.

మియాపూర్‌లో హాస్టల్స్, హోటళ్ల తనిఖీ

మియాపూర్: మియాపూర్‌లోని పలు హాస్టళ్లు, హోటళ్లను సీఐ కే క్రాంతికుమార్ ఆదేశాల మేరకు ఎస్‌ఐ మాణిక్యం బృందం ఆదివారం తనిఖీలు నిర్వహించింది. యజమానుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. యువతీ, యువకులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ వినియోగం చట్టవిరుద్ధమని, వినియోగించి దొరికితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే సైబర్ క్రైమ్స్, డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మియాపూర్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.



హాస్టల్ నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ మాణిక్యం

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సదర్



సదర్ ఉత్సవాల్లో నీలం మధుముదిరాజ్

కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు టౌన్: యాదవుల సంస్కృతి, సంప్రదాయాల కు ప్రతీక సదర్ ఉత్సవాలని కాంగ్రెస్ నేత నీలం మధుముదిరాజ్ అన్నారు. పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు మెట్టు రాజుయాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నిర్వహించిన సదర్ ఉత్సవాలకు మధు హాజరయ్యారు. ఈ సందర్భంగా నీలంమధు మాట్లాడుతూ.. సదర్ ఉత్సవాలు యాదవుల ఐక్యత, జంతువులపై వారికున్న ప్రేమ, జీవన విధానాన్ని చాటుతాయని తెలిపారు. పాడి పరిశ్రమ ద్వారా ఉపాధి పొందుతున్న యాదవ సోదరులు పశువుల సంతతి పెరగడానికి దున్నపోతులను పవిత్రంగా చూడడం ఈ సదర్ సమ్మేళన ప్రత్యేకత అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారిక పండగగా ప్రకటించారని గుర్తు చేశారు. సదర్ ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన పులిరాజు నృత్యాలు, దున్నపోతుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్పయాదవ్, కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ నర్సింహారెడ్డి, దేవరాజ్, కృష్ణ యాదవ్, పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ వర్సిటీ ఎన్నికలపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తా

ఇండిపెండెంట్ అభ్యర్థి ఆకాష్ భాటి

పంజగుట్ట: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థి సంఘం నాయకుడిని ఎన్నుకునేందుకు జరిగిన ఎన్నికల్లో ఎన్నో అవకతవకలు జరిగాయని దీనిపై రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం హైకోర్టును ఆశ్రయించనున్నట్లు ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలో ఉన్న ఆకాష్ భాటి తెలిపారు. తన అపోజిషన్ పార్టీకి 28 చెల్లని ఓట్లు ఉన్నా వాటిని పరిగణలోకి తీసుకుని కేవలం 18 ఓట్ల తేడాతో తాను ఓడిపోయినట్లు ప్రకటించారని, ఎన్నికలకు అధికారులుగా వ్యవహరించిన కొంతమంది తన ప్రత్యర్థి పార్టీ వారికి వత్తాసు పలికారని అన్ని ఆధారాలతో తాను హైకోర్టును ఆశ్రయించనున్నట్లు ఆయన తెలిపారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెల 26వ తేదీన ఎన్నికలు జరగగా 27వ తేదీన ఓట్ల లెక్కింపు జరిగిందని అధ్యక్షుని బరిలో మొత్తం ఏడుగురు ఉండగా, ఎస్‌ఎఫ్‌ఐ, ఎఎస్‌ఏ, బీఎస్‌ఎఫ్, డీఎస్‌యూ నలుగురు కలిసి పోటీ చేయగా వారికి 1313 ఓట్లు వచ్చాయని, ఇండిపెండెంట్ అభ్యర్థినైన తనకు 1295 ఓట్లు వచ్చినట్లు పేర్కొన్నారన్నారు. కానీ మొత్తం 30 బ్యాలెట్ పేపర్లపై రెండుసార్లు స్టాంప్ కొట్టారని వాటిని తొలగించాలని కోరితే దానికి వారు నిరాకరించి, తమ కౌంటింగ్ ఏజెంట్‌ను గదిలో వేసి బంధించి పోలింగ్ ఏజెంట్లు లేకుండానే ఫలితాలు ప్రకటించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము రీకౌంటింగ్ జరపాలని ఎన్నికల అధికారికి, వీసీకి, ఉన్నతాధికారులు అందరికీ వినతి పత్రాలు ఇవ్వగా వారు ఈనెల 2వ తేదీన రీకౌంటింగ్ జరుపుతూ తిరిగి చెల్లని ఓట్లు కౌంట్ చేస్తున్నారన్నారు. అధికారులు కూడా వారికే వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. వెంటనే ఎన్నికల కమిటీని బయటివారిని నియమించి వారి ఆధ్వర్యంలో రీకౌంటింగ్ చేయాలని బ్యాలెట్ పేపర్‌పై రెండు స్టాంపులు ఉన్న ఓట్లను పరిగణలోకి తీసుకోవద్దని డిమాండ్ చేశారు. లేకుంటే హైకోర్టును ఆశ్రయిస్తానని తెలిపారు. సమావేశంలో అభినవ్, సిద్ధాంత్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక పూజలకు ఏర్పాట్లు పూర్తి

రాయదుర్గం: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని నెల రోజుల పాటు ప్రతి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ మేనేజింగ్ ట్రస్టీ వాసిరెడ్డిపార్వతి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు ఈనెల 4,11,1 8,25 తేదీల్లో ఉదయం 5 గంటలకు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని ప్రత్యేకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకోవాలని ఆమె కోరారు.

శివసాయిక్షేత్రంలో నిత్య దీపారాధన షురూ



గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో కార్తీక ఆకాశదీపం వెలిగిస్తున్న దృశ్యం

కార్తీకమాసాన్ని పురస్కరించుకుని గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో నిత్య భారీ దీపారాధన కార్యక్రమాన్ని ఆలయ మేనేజింగ్ ట్రస్టీ వాసిరెడ్డిపార్వతి, అర్చకులతో కలిసి ఆదివారం ప్రారంభించారు. అంతేగాకుండా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఆకాశదీపం వెలిగించే కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేశారు.

–రాయదుర్గం





ఆలయ స్థూపంపై ఆకాశదీపం వెలగించిన దృశ్యం



శివసాయిక్షేత్రం ప్రాంగణంలో దీపారాధన..

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: విద్యుత్ మరమ్మతుల కారణంగా ఈనెల 4న (నేడు) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వైట్ ఫీల్డ్ ఏఈ కిశోర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మసీద్‌బండ, ఆర్‌వీ నిర్మాణ్, కళా జ్యోతి, సాయి పృథ్వీ లే అవుట్ తదితర ప్రాంతాల్లో కరంట్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

గచ్చిబౌలి పరిధిలో..

గచ్చిబౌలి పరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ భాస్కర్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ క్వార్టర్స్, ఎస్‌బీఐ తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో.. టమాట రూ. 40, పచ్చిమిర్చి 50, బెండ 70, కాకర 60, దొండ 50, దోస 60, ఆలు 40, చామ 60, కీర 30, బీర 60, వంకాయ 60, గోకర 70, బీన్స్ 120, బీట్‌రూట్ 60, క్యాప్సికం 100, క్యాబేజీ 40, క్యారెట్ 70, చిక్కుడు 110, ఉల్లి 70(కేజీ), ములక్కాయలు (1)10 , క్యాలీఫ్లవర్ (1) 50, సొరకాయ (కేజీ) 30, అల్లం 150, వెల్లుల్లి 350.

సీఎం సహాయ నిధితో పేదలకు భరోసా

ఆల్విన్‌కాలనీ: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు భరోసా కల్పిస్తుందని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఆదివారం ఆయన వివేకానందనగర్ డివిజన్, వెంకటేశ్వరనగర్ కాలనీకి చెందిన పాపారావు వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 45 వేల చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజల పక్షపాతి అన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి నిరంతరం సేవలను అందిస్తూ, ఆపదలో ఉన్నవారిని ఆపన్న హస్తంలా ఆదుకుంటుందన్నారు. అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు ఆర్థిక భరోసా ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నాయినేని చంద్రకాంత్‌రావు, కాశీనాద్‌యాదవ్, ఎండీ. ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యం

- బీఆర్‌ఎస్‌పై ఆరోపణలే కాంగ్రెస్, బీజేపీ లక్ష్యం
- నిధులు లేక అభివృద్ధి కుంటుపడింది
- కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పనిచేసి అత్యధిక మెజార్టీతో గెలిపించిన కార్యకర్తలకు ఎటువంటి సమస్యలు వచ్చినా అండగా ఉంటానని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఆదివారం మూసాపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు డివిజన్‌లో అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు అరాచకాలకు పాల్పడుతున్నారని, హైడ్రా పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, స్థానిక నేతలు హైడ్రాను అడ్డుపెట్టుకుని వసూళ్లకు పాల్పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ గత పదేళ్లలో రూ. వందల కోట్లతో మూసాపేట డివిజన్‌ను అభివృద్ధి చేశామని రోడ్లు, డ్రైనేజీలు, ట్రాఫిక్ సమస్యలు లేకుండా చేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి నియోజకవర్గానికి ఒక్క రూపాయి కూడా ఇవ్వక పోవడంతో అభివృద్ధి కుంటుపడిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ పార్టీలను గెలిపిస్తే ప్రజలకు ఏమైనా న్యాయం చేశారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీలు కుమ్మక్కై బీఆర్‌ఎస్‌ను తిట్టడమే లక్ష్యంగా చేసుకున్నారు తప్ప అభివృద్ధి పై దృష్టి సారించే ఆలోచన లేదన్నారు. పెద్దోళ్ల భవంతులను కూల్చడం మానేసి పేదోళ్ల కడుపులు కొట్టడానికి హైడ్రా తీసుకువచ్చారని ఆయన ఆరోపించారు. పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు ఎలాంటి ఆపద వచ్చినా వెన్నంటి ఉంటానని, ఎవరూ భయపడవద్దని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ సత్యనారాయణ, జిల్లా గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక వికాసం

కూకట్‌పల్లి: క్రీడలు మానసిక వికాసానికి దోహదం చేస్తాయని టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం అన్నారు. ఆదివారం కూకట్‌పల్లిలోని శ్రీ పుల్లారి నారాయణదాస్ కల్యాణ మండపంలో 5వ నేషనల్ లెవెల్ ఓపెన్ కరాటే, కుంగ్‌ఫూ, త్వైక్వాండో ఛాంపియన్‌షిప్ 2024 పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కర్ణాటక, మహారాష్ట్ర, బెంగళూరు, ముంబై, తెలంగాణలోని నాగర్‌కర్నూల్, వరంగల్, పెద్దపల్లి జిల్లాల నుంచి సుమారు 450 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం మాట్లాడుతూ ఆటల్లో గెలుపోటములు సమానంగా స్వీకరించి లక్ష్యం దిశగా ముందుకు సాగాలని సూచించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్, బహుమతులు అందజేశారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..!

సాక్షి, సిటీబ్యూరో: అల్లూరి క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కొండాపూర్‌లోని బొటానికల్ గార్డెన్‌లో కార్తీక మాస వనభోజనాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా క్షత్రియ కుటుంబాలు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొన్నాయి. పిల్లలు, పెద్దలు తేడా లేకుండా ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. డ్రాయింగ్ పోటీలతో పాటు మ్యూజికల్ చైర్, లెమన్ స్పూన్, తంబోలా తదితర పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు తేళ్ల రాంబాబు, జేవీరాజు, బుల్లి తెర నటుడు డి.కృష్ణంరాజు బహుమతులు ప్రదానం చేశారు.



పూడిక తరలించరూ..!



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్‌లోని వరద నీటి కాల్వల్లో తీసిన పూడికను రోడ్డుపైనే వేసిన అధికారులు నెలలు గడుస్తున్నా.. దానిని తరలించకపోవడంతో మళ్లీ సమస్య ఉత్పన్నమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. హుడా ట్రేడ్ సెంటర్ కాలనీలో ఏడు నెలల క్రితం తీసిన పూడిక అక్కడే ఉందని తిరిగి కాల్వల్లోకే చేరుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ విషయంలో ఇంజినీరింగ్ విభాగం అధికారులు పర్యవేక్షణ కొరవడిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా కాపు వనభోజనం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): శ్రీకృష్ణదేవరాయ కాపు సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం భెల్ కాలనీలో 58వ కార్తీకమాస వనభోజన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులు ఆంధ్రప్రదేశ్ ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే ఉదయభాను ముఖ్యఅతిథిలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖ సినీ కళాకారులు రోజా రమణి, చక్రపాణి, తరుణ్, పారిశ్రామికవేత్త అరవ రామకృష్ణ పాల్గొన్నారు.

నిఘా వారోత్సవాలు



కార్యక్రమంలో పాల్గొన్న భెల్ ఈడీ రాజా తదితరులు

రామచంద్రాపురం (పటాన్‌చెరు): రామచంద్రాపురం బీహెచ్‌ఈఎల్ యూనిట్‌లో ఆదివారం విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన 3కే రన్‌ను భెల్ ఈడీ కె.బి.రాజా, పీఈఅండ్ ఎస్‌డీ ఈడీ వై.శ్రీనివాస్‌రావు ప్రారంభించారు. కార్మికులు, ఉద్యోగులతో సమగ్రతా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిఘాపై ప్రతిఒక్కరికి అవగాహన కల్పించామన్నారు. పాఠశాల, కళాశాల విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశామన్నారు.

కళ్లను జాగత్తగా కాపాడుకోవాలి



అంజిరెడ్డిని సన్మానిస్తున్న నిర్వాహకులు

మోతీనగర్: జ్ఞానేంద్రియాల్లో కళ్లు అతి ముఖ్యమైనవని, వాటిని జాగ్రత్తగా కాపాడుకోవాలని మోతీనగర్ సీనియర్ సిటిజన్స్ ఫోరం అధ్యక్షుడు డాక్టర్ ప్రసాద్ అన్నారు. ఆదివారం మూసాపేట డివిజన్ మోతీనగర్ కమ్యూనిటి హాల్‌లో ఏఎస్‌ఆర్‌నగర్ నేత్ర ఐ ఇనిస్టిట్యూట్ ఆసుపత్రి, మోతీనగర్ సీనియర్ సిటిజన్స్ ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో మెగా నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 100 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. ప్రతి ఆదివారం నిర్వహించే సాధారణ వైద్య శిబిరంలో పరీక్షలను నిర్వహించారు. ఈ వైద్య శిబిరం 50 రోజుల అదుబాటులో ఉంటుందని తెలిపారు. ప్రతి వారం నిర్వహించే వైద్య శిబిరానికి సహకరిస్తున్న మోతీనగర్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ మాజీ అధ్యక్షులు అంజిరెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సభ్యులు బీజముల్ల నాగేశ్వరరావు సాగర్, కొల్లప్ప, కె. శ్రీలత , సత్యకుమార్, కుటుంబరావు, పి. వెంకటేష్ గౌడ్, గోపాల రావు, రాజు తదితరులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శనలు

మాదాపూర్: శిల్పారామంలో వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా వైష్ణవి నాట్య సెంటర్ గురువు డాక్టర్ వైష్ణవి సాయినాథ్ శిష్యబృందం ఆదివారం నిర్వహించిన భరతనాట్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఇందులో పుష్పాంజలి, అలరిపు, జతిస్వరం, శివతాండవం, కళింగనర్తన, రామస్తుతి, శివశక్తి, కృష్ణస్తుతి, జావళి తదితర అంశాలను ప్రదర్శించారు.



సర్కార్ బడుల బలోపేతమే లక్ష్యం

- డిప్యూటీ ఐఓఎస్‌లకు శిక్షణ
- పథకాల సక్రమ అమలు కోసం పర్యవేక్షణ
- ఖైరతాబాద్ జోన్ పరిధిలో శిక్షణ పొందిన ముగ్గురు ప్రధానోపాధ్యాయులు



బంజారాహిల్స్: విద్యా విషయక, పరిపాలనా అంశాలకు సంబంధించి విద్యాశాఖ గత నెల 29న బంజారాహిల్స్‌లోని సేవాలాల్ బంజారా భవన్‌లో మండల విద్యాశాఖ అధికారులకు శిక్షణ నిర్వహించింది. విద్యాశాఖకు సంబంధించిన అన్ని కార్యక్రమాలపై సమగ్ర పథకాలపై పూర్తి స్థాయిలో శిక్షణనిచ్చారు. విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ పరిధి కిందికి వచ్చే షేక్‌పేట మండల డిప్యూటీ ఐఓఎస్, బంజారాహిల్స్ రోడ్డునెంబర్–7 గతి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యాదగిరి, ఖైరతాబాద్–1 మండల డిప్యూటీ ఐఓఎస్, యూసుఫ్‌గూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పరమేశ్వరమ్మ, ఖైరతాబాద్–2 మండల డిప్యూటీ ఐఓఎస్, పంజగుట్ట పడవ హైస్కూల్ హెచ్‌ఎం శ్రావణ్‌కుమార్‌లు ఈ శిక్షణలో పాల్గొన్నారు.

పర్యవేక్షణ పథకాల సక్రమ అమలు కోసం..

◆ ఇటీవలనే ఖైరతాబాద్ జోన్ పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్, షేక్‌పేట, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, ఎర్రగడ్డ, వెంగళరావునగర్, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్ల పరిధిలో ఉన్న 17 ఉన్నత, 48 ప్రాథమిక పాఠశాలలకు నూతన ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. దీంతో బడుల్లో కొంత వరకు టీచర్ల కొరత తీరినట్లయ్యింది. డిప్యూటీ ఐఓఎస్‌లను కూడా ప్రధానోపాధ్యాయులనే నియమించారు. దీంతో వీరందరికీ శిక్షణ ఇవ్వాలని విద్యాశాఖ తలపెట్టింది. మండల విద్యా వ్యవస్థలో డిప్యూటీ ఐఓఎస్‌లు నిర్వహించే బాధ్యత చాలా కీలకమైనది. విద్యాశాఖ ఎప్పటికప్పుడు ప్రవేశపెట్టే నూతన విద్యా పథకాల సక్రమ అమలుకు వీరి పర్యవేక్షణ ప్రధానం. ప్రస్తుతం ప్రాథమిక పాఠశాలల్లో 'తొలిమెట్టు' పేరిట 1–5వ తరగతి విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమం అమలవుతుంది. ఉన్నత పాఠశాలల్లో 6–9వ తరగతి విద్యార్థుల కోసం లిప్ కార్యక్రమం జరుగుతుంది. త్వరలో జాతీయ సాధన సర్వే (నాస్)ను నిర్వహించనున్నారు. అలాగే పాఠశాలల స్థాయిలో మధ్యాహ్న భోజన పథకం, పాఠ్య పుస్తకాలు, స్కూల్ యూనిఫాంల పంపిణీ లాంటి పలు కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో విద్యా ప్రమాణాల పెంపుదల, సక్రమ పరిపాలనపై డిప్యూటీ ఐఓఎస్‌లకు ఇచ్చిన ఈ శిక్షణ ద్వారా బడుల బలోపేతానికి దోహదపడగలదని భావిస్తున్నారు. ఖైరతాబాద్ జోన్ పరిధిలోని షేక్‌పేట, ఖైరతాబాద్–1 మండలాలకు డిప్యూటీ ఐఓఎస్‌లు రావడంతో బడులు బలోపేతం కావడానికి ఆస్కారం ఏర్పడింది. వీరి పర్యవేక్షణలోనే సర్కార్ బడులను మరింత బలోపేతం చేసే దిశలో పలు కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారు. ఖైరతాబాద్ జోన్ పరిధిలో ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో సుమారుగా 500 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు.

ఈ శిక్షణ చాలా ఉపయోగం

విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ఎప్పటికప్పుడు నూతన పథకాలు ప్రవేశపెడుతున్నారు. వీటి అమలును పర్యవేక్షించడంలో టీచర్ల బాధ్యత ఎంతగానో ఉంటుంది. అందుకే బడులను మరింత బలోపేతం చేసేందుకు టీచర్లను పథకాల అమలు కోసం మరింత సన్నద్ధం చేసేందుకు ఒక రోజు శిక్షణనిచ్చారు. ఈ శిక్షణ ద్వారా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. మేము వీటిని మా మండల పరిధిలోని బడుల్లో అమలు చేస్తూ పర్యవేక్షిస్తాం. శిక్షణలో మంచి విషయాలు చెప్పారు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈ.నర్సింహారెడ్డి ఈ శిక్షణలో విపులంగా సూచనలను విశదీకరించారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వారిని మరింత ఉన్నతంగా తీర్చిదిద్దే క్రమంలో మాతోపాటు టీచర్ల బాధ్యతలను నొక్కిచెప్పారు.

– యాదగిరి, ప్రధానోపాధ్యాయుడు, గతి ప్రభుత్వ ఉన్నత పాఠశాల